క్లుప్తంగా

బ్యాడ్మింటన్ విజేత ఓబులవారిపల్లె జట్టు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో సంక్రాంతి సందర్భంగా దివంగత వైఎస్సార్ పార్టీ నాయకులు కొండూరు మల్లికార్జున రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలలో ఓబులవారిపల్లె జట్టు విజేతగా నిలిచింది. మండలస్థాయిలో జరిగిన ఈ పోటీలలో దాదాపు 40 జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్ పోటీలలో విజేతలుగా ఓబులవారిపల్లె జట్టులో సంజీవ రెడ్డి, హర్షలు గెలిపొందారు. వారికి మొదటి బహుమతి కింద రూ. 7 వేలు నగదు, ట్రోఫీని నిర్వాహకులు అందించారు.

బహుమతుల ప్రదానం

రామాపురం : సంక్రాంతి సంబరాలలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్‌ను రామాపురం మండల పరిధి చిట్లూరులో మంగళవారం నిర్వహించారు. భాను వండర్స్11, టైగర్స్ 11 టీంలు పోటీపడగా భాను వండర్స్ 11 విజేతగా, టైగర్స్11 రన్నర్స్‌గా నిలిచింది. విజేతలకు జి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సంగీత ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ రామాంజినేయులు, నారాయణస్వామిలు బహుమతులను అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు చిట్లూరు గ్రామ ప్రజలకు, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ముగ్గుల పోటీలు

పుల్లంపేట : సంక్రాంతి సందర్భంగా అనంతంపల్లె రాముల దేవాలయంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ఏడాదికి ఒక్కసారి గ్రామంలో ప్రజలంతా కలిసికట్టుగా ముగ్గుల పోటీలలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కల్గించిందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు ప్రకాష్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, శివసాయి రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకున్న రాధాకృష్ణ స్వామి

చిన్నమండెం : మండల కేంద్రంలోని బలిజపల్లెలో కనుమ పండుగ సందర్భంగా సాంప్రదాయబద్ధంగా శ్రీ రాధాకృష్ణస్వామి ద్వారా శ్రీ కాటమరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది సాంప్రదాయబద్ధంగా వస్తున్న స్వామికి ప్రత్యేక పూజల అనంతరం కాటమరాజుకు పూజుల నిర్వహించారు.

ఘనంగా గంగమ్మ జాతర



జాతరకు వస్తున్న చాందినీ బండి

రామాపురం : మండలంలోని గోపగుడిపల్లె కస్పాలో మంగళవారం శ్రీ గుండు గంగమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ అమ్మవారికి ఉదయం నుంచే భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకుంటూ బోనాలు సమర్పించారు. రాత్రి కోలాటం, చెక్కభజనలు, హరికథలు, మొక్కుబడులు గల భక్తులు చాందినీ బండ్లను ఆలయం చుట్టూ తిప్పారు.

ఎస్టేట్‌లో తాడులాగుడు పోటీలు

రాజంపేట రూరల్ : సంక్రాంతి వేడుకలలో భాగంగా దివంగత ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహిళల తాడు లాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పోటీలను రక్తికట్టించాయి. అదే విధంగా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆకేపాటి సోదరులు బహుమతులు అందజేశారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఆకేపాటి అనీల్‌కుమార్ రెడ్డి, ఆకేపాటి భరత్‌కుమార్‌రెడ్డిలు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తాళ్లపాకలో చెన్నకేశవ స్వామి ఊరేగింపు



ఊరేగుతున్న చెన్నకేశవస్వామి

రాజంపేట : తాళ్లపాకలో మంగళవారం శ్రీదేవి, భూదేవిల సమేత చెన్నకేశవస్వామిని ఘనంగా ఊరేగించారు. తితిదే ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ చివరి రోజున స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి వాహనంపై ఆశీనులు చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో స్వామివారికి కాయాకర్పూరం సమర్పించుకున్నారు. సర్పంచ్ గౌరీశంకర్, తితిదే అధికారులు, సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పండుగ మురిసేలా.. పల్లెలు మెరిసేలా

- అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు
- ఇళ్ల ముంగిట రంగవళ్లులు, గొబ్బెమ్మలతో అలంకరణ
- పశల దేవుడి ఎదుట చిట్లాకుప్పలు



రైల్వేకోడూరు అర్బన్: సంక్రాంతి వేడుకలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



నందలూరులో బహుమతులను అందజేస్తున్న ఆకేపాటి



సిద్దవటం: నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి

లక్కిరెడ్డిపల్లె : గ్రామాల్లో సోమ, మంగళవారాలల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఇంటింటా రంగవళ్లులు, గొబ్బెమ్మలతో మహిళలు సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి అందరని ఆకర్షింపజేసి సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇళ్ల వద్దకు వచ్చిన వారికి దాన ధర్మాలు చేశారు. పిండి వంటలు చేసుకొని దేవుడుకి నైవేద్యంగా సమర్పించారు. గ్రామాల్లో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. చాలా ప్రాంతాల్లో యువత క్రికెట్‌తోపాటు పలు ఆటల పోటీలు నిర్వహించడంతోపాటు ఉత్సాహంగా పాల్గొన్నారు. రైతులు పశువులను నీటితో శుభ్రపరచి ప్రత్యేకంగా అలంకరించారు. కనుమ రోజున చికెన్ సెంటర్లు, మటన్ కొట్టులు కిటకిటలాడాయి. మద్యం ఏరులైపారింది. ప్రతి గ్రామంలోను పశల దేవుడి వద్ద యువత ఉపవాసం ఉంటూ ప్రసాదాలను దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. కంప తొడుగులను ఏర్పాటు చేసి చిట్లాకుప్పను సిద్ధం చేశారు. పశువులను పశల దేవుడి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సాంప్రదాయబద్ధంగా పశువులను బెదిరంచడానికి కంపతొడుగులకు నిప్పు పెట్టగానే రైతులు పశువులను బెదిరించడానికి సిద్ధమవ్వగా పశువుల్లో ఆవులు మొదటగా పల్లెలోకి వస్తే ఈ ఏడాది పంటలు సుభిక్షంగా పండుతాయనే సాంప్రదాయంతో ముందుగా ఆవులను, ఎద్దులను పల్లెలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయడానికి రైతులు అనేక కష్టాలు పడ్డారు. గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. ఆనందోత్సాహల నడుమ ప్రజలు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

సంబేపల్లె : గ్రామాలలో ఎంతో అట్టహాసంగా రెండు రోజుల నుంచి సాంప్రదాయ పద్ధతులలో సంక్రాంతి పండుగను నిర్వహించుకున్నారు. కొత్త అల్లుళ్లు, కోడి పందేలతో ఎంతో వైభవంగా పండుగ జరిగింది. భోగి మంటలు, రంగవల్లులు, పశువులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించి ఆయా గ్రామ శివారుల్లోని కాటమరాజు ఆలయాలకు తీసుకువెళ్లి చిట్లాకుప్ప వద్ద డప్పు వాయిద్యాల నడుమ సంబరాలు జరిపారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా పట్టణాలు నుంచి స్వగ్రామాలకు బంధువులు చేరుకోవడంతో గ్రామాలన్నీ పండుగ వాతావరణంతో సందడిగా మారాయి. వేకువజామునుంచే ఇంటి ముంగిట ముగ్గులు వేసి, నూతన వస్త్రాలు ధరించి ప్రజలు సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. తల్లెంవారిపల్లె గ్రామంలో ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అరవ సుధీర్ రెడ్డి ఇంటవద్ద కేక్ కట్ చేసి ఒకరి కొకరు తినిపించుకొని సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ధనుంజయరెడ్డి స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఉన్నత పాఠశాల భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గురివిరెడ్డి, సుధీర్ రెడ్డి, అమరనాథరెడ్డి, అశోక్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మండల జేసిఎస్ కన్వీనర్ అమరేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలో సోమవారం సంక్రాంత్రి సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో సీతారామ స్వాముల చిత్రపటాలను గ్రామంలో ఊరేగింపు చేశారు. అంతేగాకుండా సిద్దవటం దిగువపేట గాంధీ వీధిలో గ్రామ పెద్దలు, యువత సమక్షంలో సంక్రాంతి రోజు రాత్రి చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలను ఎంతో వైభవంగా నిర్వహించారు. పలువురు చిన్నారు నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి.

వైభవంగా కనుమ పండుగ

రాయచోటి టౌన్ : పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణ శివార్లలో చిట్లాకుప్పలు వేసి పశువుల వేడుకలు నిర్వహించగా.. పల్లెలో అంగరంగ వైభవంగా వేడుకగా పశువులను అందంగా అలంకరించి తోలుకెళ్లారు. చిట్లాకుప్ప దగ్గర అయితే సంప్రదాయ బద్ధంగా గ్రామ పెద్దలు (పినిపెద్దలు) పెళ్లికాని యువకుల వీపుపై పశువుల దేవుడికి వండిన ప్రసాదం ముద్దను తీసుకొని కొట్టడంతో వేడుక ప్రారంభమైంది. తరువాత ఆ గ్రామ పెద్దలతో చిట్లాకుప్పకు నిప్పు పెట్టి పశువులను సంబరంగా పరుగెత్తించారు. రాయచోటిలో పట్టణంలో మదనపల్లె రోడ్డులోని పీహెచ్‌సీ (ప్రభుత్వ ఆస్పత్రి) సమీపంలో చిట్లాకుప్ప వేశారు. దిగువ అబ్బవరం, చెన్నముక్కపల్లె, యండపల్లె, గొర్లమొదివీడు గ్రామాలలో ప్రత్యేకంగా చిట్లాకుప్పకు నిప్పు పెట్టి సంబరాలు చేసుకున్నారు.

అబ్బురం.. సంక్రాంతి సంబరం

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధానంగా పల్లెసీమల్లో సంక్రాంతి సంబరాలు అబ్బురపరిచాయి. పెద్దపండుగ వేడుకల్లో భాగంగా సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ రోజున అనేక మంది కాలం చెందిన కుటుంబ సభ్యులకు దుస్తులు పెట్టుకొని పూజలు చేసి వారి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కనుమ రోజున అన్ని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. అనేక చోట్ల పశువుల కుప్పలను వేశారు. పలు గ్రామాల్లో గొబ్బెమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : మండల వ్యాప్తంగా సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాలలో భోగిమంటలు వేసి ముగ్గుల పోటీలు, దేవతా ఆరాధనలు, గ్రామోత్సవాలు సోమ, మంగళవారాలు ఘనంగా జరిపారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు స్వగ్రామం రెడ్డివారిపల్లిలో సంక్రాంతి వేడుకలలో పాల్గొని బంధువులు, స్నేహితులతో గడిపారు. అలాగే పలు కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలిసి సంక్రాంతి వేడుకలలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో కనుల విందుగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. పలు గ్రామాల్లో ఆదివారం నుండి భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు ప్రారంభించి బంధుమిత్రులతో కలుసుకొని పాత జ్ఞాపకాలను స్మరించుకుంటూ పండగలను సాంప్రదాయబద్ధంగా జరుపుకొని కనుమ పండుగ రోజు చిట్లాకుప్పలు ఏర్పాటు చేసి పశువులను పూజించారు. రైతులు తమ పశువులను రంగు రంగులతో అలంకరించి గ్రామ శివార్లలో చిట్లాకుప్పలు వేసి పశువులను బెదిరించారు. రామాపురంలో ఎద్దులబండ్లను శ్రీనివాసులు, మర్రి సతీష్ రోజంతా ఉపవాసం ఉండి సాయంత్రం మొక్కు తీర్చుకోవడం జరిగింది. అలాగే గ్రామంలోని పశువులను అలకరించి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలకు యర్రగొండ్ల గంగిరెడ్డి, మాసన, కేసగాని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లెలో మంగళవారం డీఆర్‌సీసీయూ మెంబర్, చిత్తూరు జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జల శ్రీనివాసులు రెడ్డి, పి.కృష్ణారెడ్డి, తల్లెం వెంకటసుబ్బారెడ్డి, తల్లెం రామచంద్రారెడ్డి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెయ్యేరులో సంక్రాంతి సంబరాలు

నందలూరు(రాజంపేట) : మండలంలోని చెయ్యేరు (బహుదానది)లో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని కుమ్మరపల్లి, ఇసుకపల్లి ప్రజల ఆధ్వర్యంలో గుండుమల్లికార్జున రెడ్డి, ఆనాల మధు యాదవ్‌ల ఆర్గనైజింగ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి హాజరయ్యారు. ఇసుకలో జోడెద్దుల బండ్ల పోటీలలో గెలుపొందిన అరవపల్లికి చెందిన మస్తాన్‌కు మొదటి బహుమతిగా సోఫాసెట్‌ను, నందలూరుకు చెందిన హరికి రెండో బహుమతిగా మిక్సీని, కుమ్మరపల్లికి చెందిన సుధాకర్ రెడ్డికి మూడో బహుమతిగా గ్యాస్ స్టవ్, నందలూరు, కుమ్మరపల్లికి చెందిన సుబ్బరాయుడు, బాబుకు సంయుక్తంగా నాల్గో బహుమతిగా బకెట్ సెట్, డైనింగ్ టేబుల్‌ను ఆకేపాటి చేతుల మీదుగా విజేతలుగా బహుమతులను అందజేశారు. అనంతరం చిన్న పిల్లలకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, జెడ్పీటీసీ గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగె మణి, నల్ల తిమ్మాయపల్లె సర్పంచ్ గీతాల నరసింహారెడ్డి, అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, ఇవ్వ మధురాజు, బాపనపల్లె రామకృష్ణ, మున్నా, ఉమ్మడి అవినాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవస్థానంలో..

రాజంపేట రూరల్ : భక్తుల కొంగు బంగారం, హరిహర సుతుడు శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో సోమవారం జ్యోతి దర్శనం పురస్కరించుకొని మకర సంక్రాంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో దేవాలయ ధర్మకర్త ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవాలయ ప్రధాన గురుస్వామి కొండా సత్యనారాయణ స్వామి అయ్యప్ప భక్తులు, మాల ధారులతో కలిసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిని గందంతో అలంకరణ చేశారు. జ్యోతి దర్శన సమయంలో దేవాలయంలో కర్పూరం వెలిగించి స్వామియే శరణం అయ్యప్ప అని భక్తి భావంతో శరణ ఘోష చేశారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : ప్రజలు కనుమ పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సమీప ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చిట్లాకుప్ప వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అలంకరించిన ఎద్దులను చిట్లాకుప్ప చుట్టూ తిప్పారు. అంతకుముందు కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేశారు.



లక్కిరెడ్డిపల్లె: చిట్లాకుప్పకు నిప్పంటించి పశువులను బెదిరిస్తున్న రైతులు, ప్రజలు



చిట్లాకుప్ప వద్ద పశువులను పరిగెత్తిస్తున్న ప్రజలు



చిన్నమండెం మండలంలో..



రామాపురంలో చిట్లాకుప్ప వేడుకలు



ఓబులవారిపల్లె: ధనుంజయరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పండుగ వేళ 'ప్రైవేటు' దోపిడీ



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత అంకన్న

లక్కిరెడ్డిపల్లె : సంక్రాంతి పండుగ పేరుతో ప్రైవేటు ట్రావెల్స్ వారు అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న తెలిపారు. మంగళవారం దప్పేపల్లె పంచాయతీ జాండ్రపల్లెలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని నివారించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రయాణీకుల నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ ఆర్టీసీ కంటే రెండింతలు అధికంగా వసూలు చేశాయన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు పండుగకు సొంతూళ్లకు రావడం అందరికీ తెలిసిందేనన్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ ప్రభుత్వ నిబంధనలను, ఆదేశాలను తుంగలోతొక్కి అధిక ధరలకు టికెట్లను యాప్‌ల ద్వారా విక్రయించాయన్నారు. రాయచోటి – విజయవాడకు ఆర్టీసీ రూ.721 వసూలు చేస్తుండగా ప్రైవేట్ వారు రూ.1300 తీసుకుంటున్నాయన్నారు. హైదరాబాద్‌కు రూ.2200 వరకు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. జనాల జేబులను చిల్లు చేస్తున్న అధికారులు పట్టనట్టు వ్యవహరించడం సరి కాదన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రయాణీకుల నుంచి ప్రైవేటు ట్రావెల్స్ అధిక టికెట్ ధరలను నియంత్రించాలని, ఆర్టీసీ ప్రకారమే టికెట్ వసూలు చేసేటట్టు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు స్వరూప్ తేజ, చంద్రశేఖర్, అనీల్, యశ్వంత్, అరుణ్ తేజ, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

పోటాపోటీగా సెమీఫైనల్

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన సెమీ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ పోటాపోటీగా జరిగింది. ఇండ్లూరు వినాయక లెవన్స్, కోడూరు జట్ల మధ్య పోటీ ఆసక్తిగా సాగింది. ఈ పోటీలో కోడూరు జట్టు 11 పరుగులు తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. బుధవారం కోడి చెన్నయ్యగారిపల్లి, కోడూరు మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

సత్యమ్మతల్లికి పూజలు

పుల్లంపేట : అనంతంపల్లిలో వెలసిన సత్యమ్మతల్లికి మంగళవారం పూజారి పందు ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కొందరు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించి పూజలు చేయించారు.

తీపి గుర్తులతో తిరుగు ప్రయాణాలు

- బోసిపోతున్న పల్లెసీమలు
- తల్లడిల్లిన అమ్మానాన్న, అవ్వాతాతల హృదయాలు



ప్రయాణీకులతో రద్దీగా బస్టాండ్ ప్రాంగణం

రాజంపేట టౌన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎంతో ఆనందంగా సొంతూళ్లకు వచ్చిన వారంతా తోబుట్టువులు, బంధువులతో కలిసి గడిపిన తీపిగుర్తులను మదిలో పదిలం చేసుకొని ఒక్కొక్కరుగా తిరిగి తాము నివసించే ప్రాంతాలకు బయలు దేరుతున్నారు. ప్రధానంగా సోమవారం సంక్రాంతి పర్వదినాన కాలం చెందిన కుటుంబ సభ్యులకు దుస్తులు పెట్టుకున్న వారు అనేక మంది మంగళవారం తిరుగు ప్రయాణాలను చేపట్టారు. దీంతో గత మూడు రోజులుగా బంధువులతో కళకళలాడిన పల్లెసీమలు బోసిపోతున్నాయి. సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు పల్లెటూళ్లకు వచ్చినవారంతా తమ కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులతో ఎంతో ఆనందంగా గడిపిన వారు తిరుగు ప్రయాణంలో మాత్రం కాస్త బరువెక్కిన హృదయాలతో పయనమవుతున్నారు.

తల్లడిల్లిన హృదయాలు

విద్య, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్న కన్నబిడ్డలు, వారి పిల్లలు సంక్రాంతికి ఇళ్లకు రావడంతో మూడు రోజులపాటు తల్లిదండ్రులు, అవ్వాతాతలతో ఆనందంగా గడిపారు. ప్రధానంగా వచ్చీరాని మాటలతో ముద్దుగా అవ్వాతాతలను ఆనందడోలికల్లో ముంచిన మనవళ్లు, మనవరాళ్లు తిరిగి వెళ్లే సమయంలో అనేక మంది వృద్ధుల మనసులు తల్లడిల్లిపోయాయి. కొంతమంది అవ్వాతాతలు కంటతడి పెట్టుకున్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను బరువెక్కిన హృదయంతో సాగనంపారు.

సెల్‌ఫోన్‌లలో పదిలమైన తీపి జ్ఞాపకాలు

సంక్రాంతి సందర్భంగా పల్లెసీమలకు వచ్చిన పట్టణ ప్రజలు అనేక వేడుకలను, ఆనందకరమైన తీపిగుర్తులను తమ సెల్‌ఫోన్‌లలో బంధించుకున్నారు. భోగి మంటల నుంచి గొబ్బెమ్మ వేడుకల వరకు అన్నింటినీ తమ సెల్ఫీల్లో బంధించారు. అలాగే అమ్మా, నాన్న, అన్న, చెల్లి, అక్క, తమ్ముడు, బావ, బావమరిది, మావయ్య, అత్తయ్య, అల్లుళ్లు, మనవళ్లు, మనవరాండ్రు ఇలా అందరు ఒకచోట కూర్చొని గ్రూపుగా వీడియోలు, ఫోటోలు దిగి తమ సెల్‌ఫోన్‌లలో భద్రపరుచుకున్నారు. మరో ఏడాది పాటు సంక్రాంతి తీపిగుర్తులను అప్పుడప్పుడు చూసుకునేందుకు సెల్‌ఫోన్‌లు ఎంతగానో దోహదపడ్డాయి.

మనసుకు బాధగా ఉంది నాయనా



సంక్రాంతికి బిడ్డలు, మనవళ్లు, మనవరాళ్లు, బంధువులు వచ్చినారు. బిడ్డలు అది అమ్మా, ఇదమ్మా అని, మనవళ్లు, మనవరాళ్లు అవ్వా అంటూ పలకరిస్తా ఉంటే మూడు రోజులు ఆనందంగా గడిచి పోయాయి. ఆఫీసులకు పోవాలి, స్కూళ్లు తెరుస్తారు అని బిడ్డలు ఊరికిపోయేందుకు ఒకొక్కరు రెడీ అవుతుంటే మనసుకు బాధగావుంది నాయన. – రంగమ్మ, తుమ్మల అగ్రహారం, రాజంపేట మండలం

ఎంపీపీ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



పుల్లంపేట: ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి చీరల పంపిణీలో పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు

పుల్లంపేట : ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, ముద్దా విజయమ్మల ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా వారు దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేద మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ముద్దా బాబుల్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల మహిళలు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముద్దా రామసుబ్బారెడ్డి, సుదర్శన్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, వై.శివకుమార్ రెడ్డి, కొల్లం యష్ పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంబెల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో..

రాజంపేట రూరల్ : సంక్రాంతిని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ యువజన సంయుక్త కార్యదర్శి తంబెల వేణుగోపాల్‌రెడ్డి సోమవారం మండల పరిధిలోని ఆయన స్వగ్రామం అయిన మందరం కొత్తపల్లిలో దుస్తులు పంపిణీ చేశారు. దాదాపు 1200 కుటుంబాల వారికి దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తంబెల నరసింహారెడ్డి, ఆకేపాటి హరినాథరెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఐటీ వింగ్ సభ్యులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ఐటీ వింగ్ ఎన్‌రోల్‌మెంట్ పోస్టర్‌ను శ్రీకాంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటా అందుతున్నాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సుమారు లక్షన్నరకు పైగా శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రులకు మెరుగైన ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం దృష్టి సారించాలని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పార్టీ విజయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలను, సంక్షేమ కార్యక్రమ ఫలాల గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి ఇంటికి జగనన్న చేసిన మేలును వివరించాలన్నారు. టీడీపీ పాలనలో చెప్పుకోవడానికి శాశ్వత అభివృద్ధి పథకం ఏ ఒక్కటీ లేదన్నారు. రాయచోటి ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగులు సొంతూర్లపై మమకారంతో వారి ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వామ్యులు అవుతుండడం అభినందనీయమన్నారు. పార్టీ అభిమానులైన ఐటీ నిపుణులు, ఉద్యోగులచే చురుగ్గా సభ్యత్వాలను నమోదు చేయించాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో స్టేట్ సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, ఐటీ వింగ్ స్టేట్ సెక్రటరీలు రమేష్ రెడ్డి, ధర్మారెడ్డి, గాలివీడు మండల సచివాలయ కన్వీనర్లు నల్లాబత్తుని వెంకటరెడ్డి, మలసాని అనీల్, ప్రవీణ్ కుమార్ రాజు, జయచంద్ర, గణేష్, రామ్మోహన్, ఐటీ వింగ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయించండి



సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నేతలు

రాయచోటి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరణ చేసే ప్రక్రియను సత్వరమే పూర్తిచేయించాలని సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డికి ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వై.విశ్వనాథరెడ్డి, జిల్లా కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషాలు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ చేసే ప్రక్రియలో కీలకపాత్ర పోషించిన సీఎం పీఏ ధనుంజయరెడ్డిని మంగళవారం వారు రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో కలుసుకుని పూల మొక్కను అందచేసి జేఏసీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయనతో మాట్లాడుతూ త్వరలో పార్లమెంటు, అసెంబ్లీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ వచ్చి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడక ముందుగానే రెగ్యులర్ ఉద్యోగుల నియామకపత్రాలు సత్వరం ఇచ్చేటట్లు ఉన్నతాధికారులను ఆదేశించాలంటూ విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ మేళాలో 'దేవి'కి బహుమతి

కడప కల్చరల్ : నాబార్డు నిర్వహించిన సంక్రాంతి గ్రామీణ ఉత్పత్తుల మేళాలో చిన్నమండెం మండలం మల్లూరుకు చెందిన దేవి స్టాల్‌కు ఉత్తమ బహుమతి లభించింది. నిర్వాహకులు, దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఓబుళదాస్ ఆమెకు ఈ మేరకు నాబార్డు పక్షాన ప్రశంసాపత్రం అందజేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వారం రోజులపాటు నిర్వహించిన గ్రామీణ ఉత్పత్తుల మేళాలో దేవి తమ స్టాల్‌లో కొయ్యతో చేసిన ఆకర్షణీయమైన వస్తువులతో పాటు ఇంటిలో ఉపయోగించే వివిధ సామగ్రిని ప్రదర్శించారు. వీటికి విశేష ఆదరణ లభించడంతో అమ్మకాలను మరోరోజు పొడిగించారు. నిర్వాహకులు ఓబులదాస్ అత్యుత్తమ వ్యాపారం చేసినందుకు దేవి స్టాల్‌కు ఈ బహుమతి అందజేసి ప్రశంసించారు. తనకుఈ అవకాశం కల్పించడంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్టాల్ ఏర్పాటు ద్వారా ప్రోత్సాహం అందించినందుకు దేవి నాబార్డుతోపాటు నిర్వాహకులు దాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.